సాక్షి అనంతపురం

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025

I



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు, కనిష్టం రూ.10 వేలు పలికాయి.



టమాట కిలో రూ.24

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.24, కనిష్టం రూ.14, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.4°/21.2°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై.. అక్కడక్కడ తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కి.మీ. వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఈ-పాస్ యంత్రాల పంపిణీ



డీలర్లకు ఈ-పాస్ యంత్రాలు పంపిణీ చేస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: రేషన్ డీలర్లకు అధునాతన ఈ-పాస్ యంత్రాలు అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలోని కృష్ణ కళామందిర్‌లోని రెవెన్యూ భవన్ వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరై... ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు మండలాలకు చెందిన డీలర్లకు ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేసి, మాట్లాడారు. ఆండ్రాయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారిత, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్ ఫేస్ డేటా ప్రాసెసింగ్ ఆధారంగా పనిచేసే నూతన ఈ-పాస్ యంత్రాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, ప్రతి లావాదేవీ రియల్ టైంలో నమోదవుతాయన్నారు. జిల్లాలోని 1,645 చౌక దుకాణ డీలర్లకు ఈ నెల 27వ తేదీలోపు ఈ-పాస్ యంత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, మండలాల సీఎస్ డీటీలు పాల్గొన్నారు.

వీఆర్వో సరెండర్

కళ్యాణదుర్గం: వీఆర్‌ఓ పి.ఉమేష్ బాబును కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజినల్ అధికారి వసంతబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గంలో విధులు నిర్వర్తిస్తున్న ఉమేష్ బాబు ఇటీవల అవినీతి అక్రమాలకు పాల్పడుతునట్లు ప్రాథమికంగా నిర్ధారణ జరిగిందని ఆర్డీఓ తెలిపారు. దీంతో సరెండర్ చేసినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు.

రైల్వే కార్మికులకు 78 రోజుల బోనస్

గుంతకల్లు: రైల్వే కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. దసరా పండగ సందర్భంగా 78 రోజుల వేతనానికి సమానమైన ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ కార్మికులకు చెల్లిస్తామని ప్రకటించింది. ఈ మేరకు సమాచారం అందినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. దీంతో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 14,500 మంది కార్మికులకు సుమారు రూ.24 కోట్లు మంజూరు కానున్నాయి. ఒక్కో కార్మికుని బోనస్ రూపంలో రూ.17,951 మేర ఖాతాల్లో జమ కానుంది.

జిల్లాకు 862 మెట్రిక్ టన్నుల యూరియా



అనంతపురం అగ్రికల్చర్: కోరమాండల్ కంపెనీ నుంచి బుధవారం 862.23 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 336 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, 526.23 మెట్రిక్ టన్నులను ప్రైవేట్ డీలర్లకు, మన గ్రోమోర్ సెంటర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఇండెంట్ మేరకు మార్క్‌ఫెడ్ నుంచి ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలకు, అలాగే ప్రైవేట్ డీలర్ల నుంచి రిటైల్ దుకాణాలు, కోరమాండల్‌కు చెందిన మనగ్రోమోర్ సెంటర్లకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

పడిపోయిన విశ్వఖ్యాతి

- ఎస్కేయూ క్యాంపస్‌లో భారీగా పడిపోయిన అడ్మిషన్లు
- మొత్తం 2,000 సీట్లకు 328 సీట్లే భర్తీ
- నాలుగు విభాగాల్లో కేవలం ఒక్కో అడ్మిషనే
- సోషియాలజీ, అప్లైడ్ ఎకనామిక్స్ విభాగాల్లో అడ్మిషన్లే లేవు
- కూటమి ప్రభుత్వం నిర్వాకంతో దుస్థితి
- వర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యమూ మరో కారణం



అనంతపురం: అధికారం కోసం అలవిగాని హామీ ఇచ్చారు. బాధ్యతలు చేపట్టాక తుంగలో తుక్కారు. అసలు నేడు దాని గురించి పట్టించుకోవడమే మానేశారు. కూటమి ప్రభుత్వం అలసత్వం కారణంగా ఎస్కేయూ ఖ్యాతి పడిపోయింది. ఒకప్పుడు వెలుగు వెలిగిన విశ్వ విద్యాలయం నేడు మూసివేత దిశగా పయనిస్తోందంటే అతిశయోక్తి కాదేమో!

గతంలో ఎన్నడూ లేని విధంగా

కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్కేయూలో పీజీ విభాగాలు వెలవెలబోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సీట్లు భర్తీ కాక కళ తప్పాయి. ఈ విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 27లోపు కళాశాలలో రిపోర్ట్ చేయాలని అభ్యర్థులకు సూచించారు. ఇప్పటి వరకూ పీజీ అడ్మిషన్లకు సంబంధించి కేవలం 328 సీట్లు భర్తీ అయ్యాయి. క్యాంపస్ కళాశాలలో మొత్తం 2 వేల సీట్లు ఉండగా, 328 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంగ్లిష్ 09, అడల్ట్ ఎడ్యుకేషన్ 01,తెలుగు09,హిందీ 03,సోషియాలజీ 00,సోషల్ వర్క్ 01, లైబ్రరీ సైన్సెస్ 07, రూరల్ డెవలప్‌మెంట్ 01,హిస్టరీ 08, పొలిటికల్ సైన్సెస్ 15, పబ్లిక్అడ్మినిస్ట్రేషన్ 02,అప్లైడ్ ఎకనామిక్స్ 00, ఎకనామిక్స్02, కామర్స్ 17, బయోకెమిస్ట్రీ 11, బయోటెక్నాలజీ 12, మైక్రోబయాలజీ 11, బోటనీ 11, సెరికల్చర్ 09,జువాలజీ 12,అప్లైడ్ మేథమేటిక్స్ 04, మేథమేటిక్స్ 05,స్టాటిస్టిక్స్ 04, ఫిజిక్స్ 06, కెమిస్ట్రీ 34, పాలిమర్ సైన్సెస్ 01, జియాగ్రఫీ 06, ఇన్‌స్ట్రుమెంటేషన్ 06, సెల్ఫ్ ఫైనాన్స్ 61, పేమెంట్ సీట్లు 60 చొప్పున భర్తీ అయ్యాయి. నామమాత్రపు అడ్మిషన్లతో ఎస్కేయూ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థులు లేకటీచింగ్ ఫ్యాకల్టీ సంఖ్య సైతం తగ్గిపోనుంది. టీచింగ్ అసిస్టెంట్లు, అకడమిక్ కన్సల్టెంట్లు ఇంటి దారే పట్టే దుస్థితి తలెత్తుతోంది.

ఆశపెట్టి..

గత సార్వత్రిక ఎన్నికల ముందు పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. తన యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సైతం విద్యార్థులకు ఆశపెట్టారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా ఈ అంశంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఫలితంగా పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోవడానికి విద్యార్థులు నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. మరో వైపు వర్సిటీలో పీజీ అడ్మిషన్లు పెంచేందుకు యాజమాన్యం కూడా సరైన చర్యలు తీసుకోలేదు. కోర్సులు పూర్తయిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ వైఫల్యంతోనే..



కూటమి ప్రభుత్వం వస్తే వంద రోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా ఆ విషయంపై అసలు దృష్టి సారించనేలేదు. ఎస్కేయూనే కాదు రాష్ట్రంలో ఉన్న వర్సిటీలన్నింటి పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. అయినా, పట్టించుకునే నాథుడే లేరు.

–ఈ. కుళ్లాయిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యార్థులను పట్టించుకోవడం లేదు



ఏడాదిన్నరగా ఎస్కేయూకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకం కాలేదు. ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ తోనే పాలన కొనసాగిస్తున్నారు. ఒక వర్సిటీకి ఏడాదిన్నరగా వైస్ చాన్స్‌లర్‌ను నియమించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్‌లు విద్యార్థుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదు.

– పి. హేమంత్‌కుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం, ఎస్కేయూ

ప్రాజెక్టులకు భూ సేకరణపై నిర్లక్ష్యమొద్దు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: "భూసేకరణ, బదలాయింపు ప్రక్రియ పూర్తవ్వకపోతే ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయి. భూ సేకరణలో ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుని ముందుకెళ్లాలి. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అధిగమించాలి. ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదు" అని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపు అంశాలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో, రైల్వే, ఏపీఐఐసీ, ఏపీజెన్‌కో తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ వివరాలపై ఆరా తీశారు. ఏ ప్రాజెక్టుకు సేకరించాల్సిన భూమి ఎంత, ఇప్పటి వరకు ఎంత భూమి సేకరించి అప్పగించారు, భూసేకరణకు ఏఏ చోట్ల, ఏ తరహా అడ్డంకులు ఉన్నాయి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో భూ సేకరణ చాలా కీలకమన్నారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే ఆ ప్రభావం అభివృద్ధిపై చూపిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భూసేకరణ ప్రక్రియలో ఎదురైన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. తాడిపత్రి పరిధిలోని తలారి చెరువు, ఆలూరు పరిధిలో సోలార్ పార్క్‌కు సంబంధించి డీకేటీ నివేదికను రెవెన్యూ, జెన్‌కో అధికారులు సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీఓలు కేశవనాయుడు, వసంతబాబు పాల్గొన్నారు.

నగరానికి 'షాడో' పీడ

- జిల్లా కేంద్రంలో ఆగిన అభివృద్ధి
- ప్రజాప్రతినిధి షాడోకు పర్సెంటేజీలు సమర్పిస్తేనే కాంట్రాక్టులు
- చేపట్టిన పనులను సైతం ముడుపులు ముట్టలేదని నిలిపేస్తున్న వైనం



వడ్డే కాలనీలో వర్షం వస్తే పరిస్థితి ఇలా (ఫైల్)



జీసస్‌నగర్‌లోని ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినా పనులు మొదలుకాలేదు!

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి అటకెక్కింది. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి షాడోకి పర్సెంటేజీలు సమర్పిస్తేనే పనులు ప్రారంభించే దుస్థితి నెలకొంది. దీంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న 'తమ్ముళ్లు'.. నేడు రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వారే అడ్డుపడుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ప్రారంభంలోనూ పదుల సంఖ్యలో అభివృద్ధి పనుల టెండర్లను 'షాడో' రద్దు చేయించారని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి.

ప్రజలకు అవస్థలు..

అనంతపురంలోని జీసస్‌నగర్‌లో వర్షం వస్తే రెండు, మూడ్రోజుల పాటు కాలనీ వాసులు ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది. కాలనీలో రూ.38 లక్షలతో సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించినా ఇంత వరకు పనులు మొదలు కాలేదు. విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి హౌసింగ్ బోర్డుకు వెళ్లే మార్గంలో రూ.66 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని టెండర్లు పిలిచినా పనులు మాత్రం ప్రారంభించలేదు. 38వ డివిజన్ వడ్డే కాలనీలో రూ.28 లక్షలతో రోడ్లు వేయాలని టెండర్లను పిలిచినా పనులను కాంట్రాక్టర్ చేపట్టడం లేదు. అలాగే హమాలీ కాలనీ, వేణుగోపాల్‌నగర్, గుల్జార్‌పేట, అశోక్‌నగర్, అంబేడ్కర్‌నగర్, 2,3 రోడ్లు, గౌరవగార్డెన్ ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దీనంతటికీ 'షాడో'నే కారణమని తెలిసింది.

121 పనులు.. రూ.16.19 కోట్లు

కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.16.19 కోట్లతో 121 పనులకు టెండర్లు ఆహ్వానించారు. అందులో టెండర్ స్టేజ్‌లో రూ.8.7 కోట్లకు సంబంధించి 50 అభివృద్ధి పనులు ఉన్నాయి. అగ్రిమెంట్ స్టేజ్‌లో రూ.5 కోట్లకు సంబంధించి 52 పనులున్నాయి. ప్రజాప్రతినిధి షాడోను కాంట్రాక్టర్లు ప్రసన్నం చేసుకుంటేనే పనులకు గ్రీన్ సిగ్నల్ లభించే దుస్థితి నెలకొంది. టెండర్ వేయాలన్నా.. దక్కించుకుని పనులు ప్రారంభించాలన్నా 'షాడో'ను కలవాల్సి వస్తోందని సమాచారం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటువంటి పరిస్థితి ఎక్కడా లేకపోవడం గమనార్హం.

29న ఈపీఎఫ్‌ఓ పరిష్కార వేదిక

అనంతపురం సిటీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు సంస్థ కడప రీజనల్ కమిషనర్–1 రవితేజరెడ్డి బుధవారం తెలిపారు. 'నిధి ఆప్కే నికత్ 2.0' కార్యక్రమాన్ని ప్రతి నెలా నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాకు సంబంధించి ఈ నెల 29న బుక్కరాయసముద్రం మండలం వడియంపేట సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు తమ సమస్యలను నోడల్ అధికారి దృష్టికి తీసుకుని వస్తే పరిశీలించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగానికి పిలిచి.. లేదన్నారు!

- అర్హత సాధించి..సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థికి నో చాన్స్



న్యాయం చేయాలని కోరుతున్న వరలక్ష్మి

హిందూపురం టౌన్: డీఎస్సీలో అర్హత సాధించినా.. నియామక పత్రం అందే వరకూ ఉద్యోగంపై ఆశ పెట్టుకోవద్దని మరోసారి రుజువైంది. ఇంతకీ ఏం జరిగిందంటే...బుక్కపట్నం మండలానికి చెందిన వరలక్ష్మి ప్రస్తుతం హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఆమె ఆంగ్ల సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌లో 101వ ర్యాంకు సాధించారు. ఎంపిక జాబితాలో 85 నంబర్‌లో ఉన్నారు. ఆమెను ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆమె సర్టిఫికెట్లు కూడా పరిశీలించారు. అమరావతిలో నియామక ఉత్తర్వులు తీసుకునేందుకు ఈనెల 18వ తేదీన బయలుదేరారు. అయితే కార్యక్రమం వాయిదా పడటంతో తిరిగి ఇంటికి వచ్చారు. నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు అమరావతిలో గురువారం అధికారులు కార్యక్రమం ఏర్పాటు చేయగా...బుధవారం జిల్లాకు చెందిన అభ్యర్థులంతా బయలుదేరి వెళ్లారు. అయితే ఈసారి వరలక్ష్మికి మంగళవారం రాత్రి అనంతపురం డీఈఓ వరప్రసాద్ ఫోన్ చేసి.. జాబితాలో పేరు లేదని చెప్పడంతో ఆమె కంగుతిన్నారు. అర్హత సాధించినప్పటికీ తనకు ఉద్యోగం ఎందుకు ఇవ్వడం లేదంటూ బోరున విలపించారు. అయినప్పటికీ ఆ అంశం తమ పరిధిలో లేదని అధికారులు చేతులెత్తేశారు.

చివరి నిమిషంలో పేరు మార్చారు

నేను 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌కి సెలెక్ట్ అయ్యాను. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయ్యింది. నియామక పత్రం అందుకునేందుకు సిద్ధం కాగా... మంగళవారం రాత్రి 8:30 సమయంలో డీఈఓ ఫోన్ చేసి సెలెక్షన్ లిస్టులో మీ పేరు లేదని చెప్పారు. ర్యాంకులో మీకంటే ముందున్న ఆంజనేయులు అనే అభ్యర్థికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. నేను టీజీటీలో 250 ర్యాంకు సాధించాను. ఆ ర్యాంకు ప్రకారం జోన్ -4లో తీసుకున్నప్పటికీ టాప్ లిస్టులో రెండో స్థానంలో 250 ర్యాంకుతో టీజీటీ పోస్టుకు అర్హత ఉంది. అందులో ఉద్యోగం ఇవ్వాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. నాకంటే తక్కువ ర్యాంకు సాధించిన వారికీ ఉద్యోగం ఇచ్చారు. కానీ టీజీటీలో నాకు 250 ర్యాంకు వచ్చినా అనర్హురాలిగా ప్రకటించారు. కనీసం టీజీటీలోనైనా ఉద్యోగం ఇవ్వాలి.

– వరలక్ష్మి

క్లుప్తంగా

సకాలంలో ఈ-పంట నమోదు చేయాలి


సూచనలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ రూరల్: ఈ-పంట నమోదు ఈ నెల 30తో ముగుస్తున్న నేపథ్యంలో గడువు లోపు రైతుల ఈ-కేవైసీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. బుధవారం ఉరవకొండ మండలంచిన్న ముష్టూరు, మోపిడి గ్రామాల పరిధిలోని పొలాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఆయా గ్రామాల పరిధిలో సాగు చేసిన కంది పంటను పరిశీలించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ-పంట నమోదు జిల్లాలో 5.46 లక్షల ఎకరాల్లో నమోదు కాగా, ఉరవకొండ మండల పరిధిలో 22 ఎకరాల్లో నమోదు అయినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

27న ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కోటక్ మహీంద్రా బ్యాంకు అనుబంధ బీఎస్ఎస్ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగాలకు ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వై.వి.మల్లారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులు. 20 నుంచి 30 సంవత్సరాల్లోపు వయస్సు, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 16వేల నుంచి రూ.25వేలు జీతం చెల్లిస్తారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27న ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు.

అమరావతికి తరలిన డీఎస్సీ అభ్యర్థులు


జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ-25కు ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం అమరావతికి తరలి వెళ్లారు. జిల్లాతో పాటు జోనల్ పోస్టులకూ ఎంపికైన వారితో పాటు సంబంధీకులు ఒకరు తోడుగా ఉన్నారు. ఉదయాన్నే అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల వద్ద అల్పాహారం ముగించుకుని మొత్తం 45 బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. బస్సులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. గురువారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో సీఎం, విద్యాశాఖ మంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకుంటారని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు మునీర్‌ఖాన్, శ్రీనివాసులు, డెప్యూటీ డీఈఓలు శ్రీనివాసులు, మల్లారెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

అంతం కోరుతున్న ఆస్తి



అనుబంధాలకు ప్రస్తుత సమాజంలో విలువ లేకుండా పోతోంది. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు కనుమరుగవుతున్నాయి. ఆస్తుల మాయలో పడి సొంత వారిని సైతం హతమార్చే స్థాయికి బంధాలు దిగజారుతున్నాయి. డబ్బుంటే చాలు .. ఇంకేం వద్దు అనే స్థాయికి దిగజార్చి పేగు బంధాలను కడతేరుస్తున్నాయి. డబ్బు ముందు భార్య భర్తల బంధం, తండ్రి బిడ్డల అనుబంధం అన్నీ బలాదూర్ అవుతున్నాయి. ఎంతకైనా తెగించి ప్రాణాలు తీయడం సర్వ సాధారణం అవుతోంది.

- మంట కలుస్తున్న మానవత్వం
- ఆస్తి కోసం కన్నవారినే బలిగొంటున్న బిడ్డలు

రాయదుర్గం: 'నాన్నా! నీవు చచ్చిపో... ఆస్తి సొంతమవుతుంది' అంటూ స్థిరాస్తుల కోసం రక్త సంబంధాలనే కాదనుకునే కొందరి తీరుతో మానవత్వం మంట కలుస్తోంది. జన్మనిచ్చిన తల్లి, తండ్రిని హతమార్చడం, మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదంటూ కట్టుకున్న భార్యను హత్య చేయడం వంటి ఘటనలు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. కొందరు మద్యం మత్తులో, మరికొందరు క్షణికావేశంలో, ఇంకొందరు పథకం ప్రకారం హత్యలకు పాల్పడిన ఘటనలు మానవత్వానికి మాయని మచ్చగా నిలిచాయి.

మచ్చుకు కొన్ని...

జిల్లాలో ఆస్తుల కోసం కన్న వారినే హతమార్చిన ఘటనలు దాదాపు 16 వరకు ఉన్నాయి. కారణాలేమైన సరే మలి వయస్సులో వారికి తోడుగా ఉండాల్సిన కన్నబిడ్డలే విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారు. కొట్టడం, తిట్టడం, పేగు బంధం అన్న మాటే మరిచి మారణాయుధాలతో మట్టుపెట్టడం లాంటి ఘటనలు చూస్తుంటే సభ్యసమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదు.


కొడుకు చేతిలో హత్యకు గురైన వాల్మీకి సుంకప్ప (ఫైల్)


దాయాదుల చేతిలో మృతి చెందిన గంగాధర (ఫైల్)

- ఈ ఏడాది మార్చి 25న రాయదుర్గం మండలం టి.వీరాపురంలో వాల్మీకి సుంకప్ప (62) దారుణ హత్యకు గురయ్యాడు. కుమారుడు వన్నూరుస్వామినే మచ్చుకత్తితో గొంతు కింద నరికి చంపేశాడు. తండ్రి పేరుపై ఉన్న రెండు ఎకరాల స్థిరాస్తిని తన పేరుపై బదలాయించాలని కొంత కాలంగా కుమారుడు పట్టుపట్టడంతో తన మరణానంతరం ఆస్తి నీ సొంతమవుతుందని తండ్రి నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. ఈ మాటతో క్షణికావేశానికి లోనై తండ్రి ప్రాణాలను బలిగొన్నాడు.
- మండలంలోని చదం గ్రామంలో గత ఏడాది డిసెంబర్ 12న దాయాదుల మధ్య భూవివాదం చోటు చేసుకుని ఘర్షణ పడ్డారు. ఇందులో గంగాధర అనే రైతు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరాడు. కొన్నాళ్ల తర్వాత మృతి చెందాడు. ఆయన మృతికి పొలం గట్టు మధ్య పడిన ఘర్షణనే కారణమని పోలీసులు నిర్ధారించారు.
- రాయదుర్గానికి చెందిన ఓ రైతు ఇటీవల కర్ణాటక సమీపంలోని పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. కుమారుడికి కాకుండా కోడలికి వత్తాసు పలుకుతుంటాడనే అక్కసుతో కన్న కుమారుడే ఓ రోజు మచ్చుకత్తితో దాడి చేసి హతమార్చాడు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దర్యాప్తులో అది హత్యగా పోలీసులు నిర్ధారించారు.

బాధ్యతగా వ్యవహరించాలి



భూతగాదాలు, స్థిరాస్తుల మార్పిడికి ఒత్తిడి చేస్తున్నట్లుగా తెలిసిన వెంటనే స్పందిస్తున్నాం. ఆయా అంశాల్లో బాధితుల పిల్లలను పిలిపించుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నాం. కాదనుకుని మొండిగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తున్నాం. కన్నవారి పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. లేకుంటే చర్యలు తప్పవు.

– పి జగదీష్, ఎస్పీ

చాలా సున్నితంగా ఉంటారు



ప్రతి చిన్న విషయానికి తల్లిదండ్రుల్ని బాధ పెట్టడం సరైంది కాదు. వృద్ధాప్యంలో ఉన్న వారి మనోభావాలు చాలా సున్నితంగా ఉంటాయి. గట్టిగా మాట్లాడినా, కోప్పడినా వెంటనే మానసికంగా కుంగిపోతారు. సమయానికి కొంత తిండి, ఆరోగ్యం పట్ల కాసింత జాగ్రత్త వహిస్తే చాలు.

– మెర్సీ జ్ఞానసుధ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం

ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి అదృశ్యం

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తికి చెందిన సాకే పోతులయ్య భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదు. సీఐ టీవీ.శ్రీహర్ష తెలిపిన మేరకు.. రాయదుర్గం మండలం గ్రామదట్ల గ్రామానికి చెందిన వన్నూరు స్వామి కుమార్తె పద్మలతకు గాండ్లపర్తి గ్రామానికి కొండన్న కుమారుడు సాకే పోతులయ్యతో 2021 సెప్టెంబర్ 21న వివాహమైంది. పోతులయ్య ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 22న ఉదయం పద్మలత తన భర్తకు తెలపకుండా ఇద్దరు కుమార్తెలను తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి వారి కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. ఆచూకీ లక్ష్యం కాకపోవడంతో మంగళవారం రాత్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96817కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన చిత్రయ్య

రాయదుర్గం టౌన్: రైలు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న కొంతానపల్లికి చెందిన చిత్రయ్య బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో రాయదుర్గంలోని శాంతినగర్ సమీపంలో పట్టాలు దాటేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన గూడ్స్ రైలు ఢీకొనడంతో ఎగిరి పట్టాల పక్కన పడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- రికార్డుల్లో లేకున్నా రైతు పొలంలో రస్తా


రహదారి వేస్తున్న దృశ్యం

కుందుర్పి: జంబుగుంపల గ్రామంలో టీడీపీ నేతలు చెలరేగిపోయారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారనే అక్కసుతో రైతుల పొలాల్లో దౌర్జన్యంగా రస్తా వేసేందుకు ఉపక్రమించారు. అడ్డుకోబోయిన మహిళలను బెదిరించడంతో బాధితులు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. జంబుగుంపల గ్రామంలోని సర్వే నంబర్ 110లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు రైతులు దొడ్డయ్య, ఎర్రమల్ల తదితరులకు చెందిన భూమి ఉంది. బుధవారం సాయంత్రం టీడీపీ నాయకుల ప్రమేయంతో తహసీల్దార్ ఓబులేసు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆ భూమిలో ప్రభుత్వ శివాయి జమ భూమి కూడా ఉందని రస్తా వదలకపోతే స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ భూమిని వదిలేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే ఇదే సర్వే నంబర్‌లో పట్టా భూమి కూడా ఉందని, అందులో రస్తా వదిలేందుకు సాధ్యం కాదని అన్నారు. ఆ సమయంలో ఎందుకు సాధ్యం కాదంటూ టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. రెవెన్యూ అధికారులను ఉసిగొల్పి సర్వే చేయించారు. అడ్డుకోబోయిన లక్ష్మి, నాగలక్ష్మిని రెవెన్యూ అధికారుల సమక్షంలోనే చితకబాదారు. జేసీబీని రప్పించి రస్తా ఏర్పాటుకు భూమి చదను పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, గ్రామ సర్పంచ్ గంగాధర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మహేంద్ర, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ డీలర్ నాగరాజు బాధితులకు అండగా నిలిచారు. పట్టా భూముల్లో రస్తా లేకున్నా.. టీడీపీ నాయకుల మాటలకు తలొగ్గి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సబబు కాదని హితవు పలికారు. కాగా, ఇదే విషయంగా తహసీల్దార్ ఓబులేసు మాట్లాడుతూ.. రస్తా వేసిన పొలానికి సంబంధించి 50సెంట్లకు పైగా భూమి ప్రభుత్వ శివాయి జమ లెక్కలో ఉందన్నారు. ఈ విషయంగా సదరు రైతులకు నచ్చజెప్పి చుట్టుపక్కల రైతులకు ఇబ్బంది లేకుండా రస్తా వేయించామని పేర్కొన్నారు.

డబుల్ మర్డర్ కేసులో నిందితుడిపై దాడి


గాయపడిన సుల్తాన్ హుస్సేన్

తాడిపత్రి టౌన్: రెండేళ్ల క్రితం తాడిపత్రిలో చోటు చేసుకున్న డబుల్ మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్న కాకర్ల సుల్తాన్ హుస్సేన్‌పై హతుల బంధువులు దాడికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. 2022లో జరిగిన డబుల్ మర్డర్ కేసులో ఆరుగురు నిందితులు కాగా, 2024 జనవరిలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆరిఫ్ అనే నిందితుడిని హతుల బంధువులు దాడి చేసి హతమార్చారు. దీంతో కాకర్ల సుల్తాన్ హుస్సేన్ ప్రాణభయంతో బెంగళూరుకు మకాం మార్చాడు. ఈ క్రమంలో తన తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నట్లుగా తెలుసుకున్న ఆయన రెండు రోజుల క్రితం తాడిపత్రికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న డబుల్ మర్డర్ కేసులో బాధిత బంధువులు, బుక్కపట్నం వీధికి చెందిన రహంతుల్లా, షాషు, షాంబుల్లా మంగళవారం రాత్రి సుల్తాన్ హుస్సేన్‌పై ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. వారి బారి నుంచి తప్పించుకుని హుస్సేన్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

గుత్తి: స్థానిక అమృత్ సినిమా థియేటర్ వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో మట్కా రాస్తూ ముగ్గురు బీటర్లు పట్టుబడినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం తనిఖీలు చేపట్టిన సమయంలో మట్కా రాస్తూ రామాంజనేయులు, రాము, యల్లమ్మ పట్టుబడ్డారన్నారు. బీటర్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.25,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రధాన పంటగా కంది

- గత రెండేళ్లుగా వేరుశనగ సాగుపై రైతుల్లో సన్నగిల్లుతున్న ఆసక్తి
- ఈసారి 183 శాతంతో 1.01 లక్షల హెక్టార్లతో అగ్రస్థానంలో కంది
- 89 వేల హెక్టార్లకే పరిమితమైన వేరుశనగ


కంది పంట

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో కంది ప్రధాన పంటగా అవతరిస్తోంది. గత కొన్ని దశాబ్దాలుగా ఏక పంటగా లక్షలాది హెక్టార్లలో సాగవుతూ వస్తున్న వేరుశనగను వెనక్కినెట్టి కంది తొలిస్థానాన్ని ఆక్రమిస్తోంది. గత నాలుగైదు సంవత్సరాలుగా జిల్లా రైతులు కంది సాగుపై మొగ్గుచూపడమే ఇందుకు కారణం. 2024 ఖరీఫ్‌లో ఏకంగా 1.03 లక్షల హెక్టార్లలో కంది సాగులోకి రాగా ఈ ఖరీఫ్‌లో కూడా 1.01 లక్షల హెక్టార్లకు చేరుకుంది. ఈ-క్రాప్ ముగిస్తే కంది విస్తీర్ణం మరికొంత పెరిగే అవకాశమున్నట్లు సమాచారం. జిల్లా చరిత్రలో తొలిసారిగా కంది పంట వేరుశనగను దాటిపోవడం ఇదే తొలిసారి. గతేడాది కంది విస్తీర్ణం పెరిగినా... వేరుశనగను అధిగమించలేకపోయింది. ఈ సారి కంది తొలిస్థానంలో నిలవడం విశేషం. కంది సాధారణ సాగు విస్తీర్ణం 55,296 హెక్టార్లు కాగా 183 శాతంతో 1.01 లక్షల హెక్టార్లకు చేరుకుంది. గతంలో ఉమ్మడి జిల్లాలో కూడా ఈ స్థాయిలో కంది ఎన్నడూ సాగులోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో 2017లో అత్యధికంగా 71 వేల హెక్టార్లుగా నమోదైంది.

లక్ష హెక్టార్లలోపే వేరుశనగ

గత నలభైయేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి వేరుశనగ సాగు విస్తీర్ణం లక్ష హెక్టార్ల లోపే పరిమితమైంది. ఈ సారి 1.82 లక్షల హెక్టార్లు అంచనా వేయగా అతి కష్టంపై 89 వేల హెక్టార్లకు చేరుకుంది. పెట్టుబడులు పెరగడం, కూలీల సమస్య, అననుకూల వర్షాల వల్ల పంట దిగుబడులు తగ్గిపోవడం, చివరికి గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడం, చీడపీడల వ్యాప్తి, అడవిపందులు, జింకల బెడద తదితర కారణాలతో వేరుశనగ పేరు వింటనే రైతులు బెదిరిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అలాగే నల్లరేగడి భూముల్లో పత్తి విస్తీర్ణం 44 వేల హెక్టార్లు అంచనా వేయగా అదనులో వర్షం పడకపోవడంతో 24 వేల హెక్టార్లకు పరిమితమైంది. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మొక్కజొన్న ఇటీవల క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది 14,653 హెక్టార్లు అంచనా వేయగా ఏకంగా 25,500 హెక్టార్లకు పెరిగింది. 16,293 హెక్టార్లు అంచనా వేసిన ఆముదం 15,406 హెక్టార్లకు చేరుకుంది. నీటి వనరులు పెరగడంతో 19,466 హెక్టార్లు అంచనా వేసిన వరినాట్లు 22,500 హెక్టార్లకు చేరుకుంది. సజ్జ 2,054 హెక్టార్లకు గానూ 3,583 హెక్టార్లలో సాగైంది. రాగి, కొర్ర, ఉలవ, పెసర, అలసంద, మినుము, సోయాబీన్, పొద్దుతిరుగుడు తదితర పంటలు నామమాత్రపు విస్తీర్ణంలో సాగులోకి వచ్చినట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక వెల్లడి చేస్తోంది. మొత్తమ్మీద ఈ ఖరీఫ్‌లో 3,42,232 హెక్టార్లలో పంటలు సాగులోకి వస్తాయని అంచనా వేయగా... 83 శాతంతో 2,84,834 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేశారు. ఈ క్రాప్ నమోదు పూర్తయితే ఖచ్చితమైన సాగు లెక్కలు అందుబాటులోకి రానున్నాయి.


పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించండి

- అధికారులకు జెడ్పీ సీఈఓ శివశంకర్ ఆదేశం


ఇంటింటా చెత్త సేకరణపై స్థానికులతో ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

రాప్తాడు: ప్రస్తుతం సేంద్రియ ఎరువులకు భారీగా డిమాండ్ ఉందని, అందువల్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని బుక్కచెర్ల గ్రామ పంచాయతీలో పర్యటించారు. పంచాయతీ కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారా, తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందువల్ల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంచాయతీ కార్మికులు కూడా తమకు కేటాయించిన ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, అక్కడ వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఈఓఆర్డీ ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

'సత్య'కీర్తి అంతర్జాతీయంగా శోభిల్లేలా..


సత్యసాయి శతజయంత్యుత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రశాంతి నిలయం: 'సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందాం. వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారు. ఏ ఒక్క భక్తుడికీ ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేద్దాం. మన ఆతిథ్యంతో సత్యసాయి కీర్తిని అంతర్జాతీయంగా శోభిల్లేలా చేద్దాం' అని అధికారులకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సత్యసాయి శత జయంతి వేడుకల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సత్యసాయి శతజయంతి వేడుకలను దేశం గర్వించేలా పర్యావరణ హితంగా నిర్వహించాలన్నారు. రోజువారీ భక్తుల రాకపోకలను ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తాగునీరు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డస్ట్‌బిన్లు, వ్యర్థాల నిర్వహణ, ఫుడ్ కౌంటర్లు, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తుల రాకపోకలు, ముఖ్య ప్రదేశాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్టమైన పహారా కోసం స్పష్టమైన కార్యాచరణ ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు చలం, డాక్టర్ నారాయణన్, ప్రభ, రామేశ్వర్ వృష్టి, రాజేష్ దేశాయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే హైడ్రామా!

- సినీ ఫక్కీలో దాదాపు వంద కిలో మీటర్లకు పైగా ఛేజింగ్
- గోవా మద్యాన్ని తరలిస్తున్న ముఠా పట్టివేత
- రూ.1,76,904 విలువైన మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం: పట్టపగలే హైడ్రామా నడిచింది. గోవా మద్యం తరలిస్తూ కొందరు యువకులు ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దాదాపు వందకు పైగా కిలోమీటర్ల మేర సినీ ఫక్కీలో ఛేజింగ్‌చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్‌రెడ్డి వెల్లడించారు.

అడ్డుకుంటే చంపుతామంటూ...

గోవా నుంచి మద్యాన్ని బుధవారం ఉదయం అక్రమంగా జిల్లాలోకి తరలించుకుని వస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమై ఆత్మకూరు మండలం వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపు కాశారు. ఉదయం 10.30 గంటల సమయంలో అటుగా వచ్చిన స్విఫ్ట్ కారును అడ్డుకుని పరిశీలిస్తుండగా డ్రైవర్ వాకీ టాకీ ద్వారా వెనుక వస్తున్న ఇన్నోవా కారు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం గమనించారు. దీంతో వెనువెంటనే మరో వాహనంలో ఆత్మకూరు వైపుగా ఎక్సైజ్ అధికారులు వెళుతుండగా హంద్రీ-నీవా కెనాల్ వద్ద ఇన్నోవా కారు ఉన్నఫళంగా వెనక్కు తిరిగి కాలువ గట్టుపై నుంచి శరవేగంగా దూసుకెళ్లింది. దీంతో ఎక్సైజ్ అధికారులు తమ వాహనంలో వెంబడించారు. ఒకానొక దశలో ఎక్సైజ్ అధికారుల వాహనాన్ని ఢీకొని ముందుకు సాగుతూ ఇనుపరాడ్లను తీసి ప్రదర్శిస్తూ తమను అడ్డుకుంటే చంపుతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు వదలకుండా ఇన్నోవా కారును వెంబడిస్తూ వెళ్లారు. చివరకు సాయంత్రం 4 గంటల సమయంలో కర్ణాటక సరిహద్దులోని తిరుమణి వద్ద ఉన్న బాలసముద్రం టోల్ ప్లాజా వద్ద ఇన్నోవా కారును అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడింది వీరే..

స్విఫ్ట్ కారుతో పాటు, ఇన్నోవాను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు వాటిని జిల్లా ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. రెండు వాకీ టాకీలు, మొత్తం రూ.1.76 లక్షల విలువ చేసే హనీగ్రేడ్ బ్రాందీ (180 ఎం.ఎల్)- 97 బాక్సులు, గోల్డెన్ ఏఎస్ ఫైన్ విస్కీ (180 ఎం.ఎల్) – 16 బాక్సులు, మాన్షన్ హౌస్ బ్రాందీ (750 ఎం.ఎల్)- 3 బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కె.వీరేంద్ర, డి.ప్రవీణ్, కె.వెంకటేష్, కె.పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో కె.వీరేంద్రపై మద్యం కేసులు చాలా ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే ఏనాడూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడలేదన్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఏఈఎస్ వి.శ్రీరాం, ఇన్‌స్పెక్టర్లు కె.అన్నపూర్ణ, ఎస్.అలీబేగ్, ఎస్ఐలు సి.నరేష్ బాబు, ఎం.హరికృష్ణ, ఎన్.సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు రామచంద్ర, ఫణీంద్ర, రమేష్‌బాబు, కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, వెంకటప్రసాద్, ఎస్.మారుతి, ఎం.మారుతి, శివానంద రెడ్డి, నాగముని, చరణ్ కుమార్, సందీప్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్ రెడ్డి, హెచ్.ఆర్. ప్రసాద్ (ఎస్ఐ), అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

క్లుప్తంగా

పంపనూరు హుండీ ఆదాయం రూ.11 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీలోని కానుకలను లెక్కించారు. మొత్తంగా రూ.11,31,235 ఆదాయం వచ్చినట్లు ఈఓ బాబు తెలియజేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మొక్క నాటుతున్న కళాశాల నిర్వాహకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరమన్నారు. ప్రిన్సిపాల్ ఎస్వీపీ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక భావన రేకెత్తించేలా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ పీఓలు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని జై బీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామప్ప నాయక్ అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద జై బీమ్ రావు భారత్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామప్ప నాయక్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కాలేజీలను కట్టించారన్నారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. ప్రైవేటీకరణ ఆపని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్ కోడవండ్ల, వనూరు స్వామి, చంద్ర చర్ల హరి తదితరులున్నారు.

ఎన్ఎంయూ డిపో నూతన కమిటీ

అనంతపురం క్రైం: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అనంతపురం ఆర్టీసీ డిపో గ్యారేజీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ చైర్మన్ సూరిబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం అనంతపురం ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ డిపో గ్యారేజీ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా కే. ఓబయ్యతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

రాప్తాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలని సూచించారు. సమావేశానికి హాజరుకాకపోయినా, కిందిస్థాయి అధికారులను పంపినా సదరు అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో నైపుణ్యాభివృద్ధి

రాప్తాడు: వృత్తి విద్య కోర్సుల ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవచ్చని రాప్తాడు జెడ్పీ ఉన్నత పాఠశాల వృత్తి విద్యా శిక్షకురాలు సంకే మౌనిక అన్నారు. రాప్తాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 'పీఎంశ్రీ'లో భాగంగా 10 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ శిక్షణను అందిస్తున్నారు. బుధవారం ఉపాధ్యాయురాలు మౌనిక విద్యార్థులకు సీలింగ్ ఫ్యాన్, టెబుల్ ఫ్యాన్, ఎయిర్ కూలర్, మిక్సి, కుక్కర్ తదితర వస్తువుల మరమ్మత్తులకు గురైయితే వాటిని ఎలా మరమ్మతు చేయాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వృత్తి, విద్య కోర్సులకు రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు.



అన్నపూర్ణాదేవిగా రేణుకా యల్లమ్మ



సున్నపుగేరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రెండో రోడ్డులోని శ్రీ పీఠంలో పూజలందుకున్న లలితా అమ్మవారు



ప్రత్యేక పూజలందుకున్న తపోవనంలో గాయత్రీమాత



ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో సుంకులమ్మ

నయన మనోహరం

అనంతపురం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు నయనమనోహరంగా సాగుతున్నాయి. బుధవారం జగన్మాత విభిన్న రూపాలలో సాక్షాత్కరించి పూజలందుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో అమ్మవారికి కళాకారులు భక్తినీరాజనాలర్పించారు. రెండో రోడ్డులోని శ్రీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో చండీ పారాయణం, సాయంత్రం చండీహోమం, సామూహిక కుంకుమార్చనలు, రాత్రి గ్రామోత్సవం, అన్న ప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో జరిగాయి. మొదటి రోడ్డు శివాలయంలో శారదామాత అన్నపూర్ణగా అవతరించి భక్తులకు దర్శనమిచ్చారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ లలితాదేవిగా, శంకరమఠంలో శారదాదేవి కౌమారి అలంకారంలో దర్శనమిచ్చారు. సుభాష్‌రోడ్డు అర్బన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద జరిగిన వేడుకలకు చైర్మన్ జేఎల్ మురళీ, మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాతి భరత్ ఆత్మీయ అతిథులుగా పాల్గొని శాస్త్రీయ నృత్యాలు చేసిన చిన్నారులను అభినందించారు.శివబాల యోగి ఆశ్రమంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. కొత్తూరు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో రాజరాజేశ్వరీగా, పాతూరులో అన్నపూర్ణాదేవిగా అలంకారమైన వాసవీమాతను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మారుతీనగర్‌లో దుర్గామాత, సాయినగర్‌లో కనకదుర్గమ్మ, గుత్తిరోడ్డు, మొదటి రోడ్డులో చౌడేశ్వరితల్లి విభిన్న రూపాలలో భక్తులను కరుణించారు.



కొత్తూరులో రాజరాజేశ్వరీ అలంకారంలో వాసవీ మాత



నగరంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



ఉమానగర్‌లో రేణుకాయల్లమ్మను దర్శించుకుంటున్న మాజీ మేయర్ రాగే పరశురామ్



భక్తులతో కిక్కిరిసిన కొత్తూరులోని అమ్మవారి శాల



పాతూరులో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



పాతూరు అమ్మవారి శాలలో కళాకారుల నృత్య ప్రదర్శనలు

వడ్డెర్లు ఐక్యంగా ఉండాలి



భూమి పూజ చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: వడ్డెర్లు ఐక్యంగా ఉంటేనే అభ్యున్నతి సాధ్యమని వడ్డెర సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం వడ్డే ఓబన్న జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నడిమివంక వద్ద విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాక్షన్ కమిటీ సభ్యులు వడ్డే గోపాల్, మల్లెల జయరాం, వీకే గంగన్న, కుంచెపు వెంకటేష్, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు మాట్లాడుతూ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల వేణుగోపాల్, కుంచపు శంకర్, చియ్యేడు రామకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలందించాలి

అనంతపురం మెడికల్: వైద్య వృత్తిలో నిస్వార్థంగా సేవలందిస్తేనే వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. దేశంలోనే ఎన్ఎస్ఎస్‌లో రాష్ట్రపతి అవార్డు సాధించిన ఏకైక వైద్య కళాశాల అనంతపురం అని గుర్తు చేశారు. అవార్డు రావడంలో తనవంతు కృషి చేసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడును ప్రిన్సిపాల్ సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీవారు



అనంతపురం కల్చరల్:అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకుడు శ్రీవారి బ్రహ్మోత్సవ సంబరాలు భక్తులను ఆనంద పరవశులను చేస్తున్నాయి. ఉత్సవాలలో భాగంగా స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై హంస వాహనంపై విహరించారు. నగరవీధుల్లో పల్లకీసేవ సాగుతున్నప్పుడు భక్తులు కోలాటంతో, భజనగీతాలతో హారతులు పట్టారు. ఉదయం నవగ్రహ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చాటనల నడుమ శాస్త్రోక్తంగా సాగాయి. భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. రామ్‌నగర్, హౌసింగు బోర్డుల్లోని వేంకటేశ్వరాలయాలలో బ్రహ్మోత్సవ సంబరాలు కమనీయంగా జరిగాయి.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

అనంతపురం అర్బన్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు మోసపూరిత మాటలు మాట్లాడారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకే పీపీపీ విధానాన్ని సీఎం తీసుకొచ్చారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే జీఓ 107, 108 రద్దు చేస్తామని యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా జీఓలు రద్దు చేయక పోగా వైద్యవిద్యను పేదలకు దూరం చేసేలా పీపీపీ విధానం తీసుకొచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం ఇలా అన్నీ ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధపడుతున్న కూటమి ప్రభుత్వ పెద్దలను రాష్ట్ర ప్రజలు క్షమించబోరన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తే ప్రజాందోళనకు సిద్ధపడతామని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

ప్రజల జీవితాలను మెరుగుపరచాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రజల జీవితాలను మెరుగుపరిచే దిశగా ముందుకు సాగాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మైభారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.భరత్ పిలుపునిచ్చారు. 56వ ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు అధ్యక్షత వహించగా మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, గ్రామాలను దత్తత తీసుకోవడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి విష్ణుప్రియ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ టి.జితేంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం. విష్ణు ప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం. బాలాజీ నాయక్, బి.నాగభూషణం, డి.సుగుప్ప, శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యతలో రాజీ పడబోం



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఈఈ మల్లికార్జున మూర్తి

అనంతపురం సిటీ: రహదారుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ప్రసక్తే లేదని పంచాయతీరాజ్ ఉమ్మడి జిల్లా క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) మల్లికార్జున మూర్తి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన, జరుగుతున్న రహదారుల నాణ్యతను పరిశీలించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి–శెట్టూరు మార్గంలో రూ.1.20 కోట్లతో చేపట్టిన రహదారి పనులను బుధవారం పరిశీలించినట్లు అనంతపురంలో విలేకరులకు తెలిపారు. తన వెంట డీఈఈలు లోకన్న, నాగేంద్ర కుమార్, ఏఈఈలు పద్మజ, ప్రసాద్ తదితరులు ఉన్నట్లు పేర్కొన్నారు. రహదారుల నిర్మాణాలకు వాడిన ముడి సరుకు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వివరించారు. వాటిని పరిశీలించి నివేదిక రూపొందిస్తామని వెల్లడించారు.

తప్పుల్లేని ఓటరు జాబితానే లక్ష్యం



మాట్లాడుతున్న ఈఆర్ఓ రామ్మోహన్

రాప్తాడు: తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ) రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలు, చట్టాల్లో అవసరమైన మార్పులు గురించి రాజకీయ పార్టీ నుంచి సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. నోటీసు ఇచ్చిన తర్వాత ఓటు తొలగింపు, మరోచోటకు మార్పు ఉంటుందన్నారు. రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి వెంటనే తొలగించాలని బీఎల్ఓలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సేవ్ ఆర్డీటీ' పోరుకు అనుమతివ్వాలి



మాట్లాడుతున్న ఆర్డీటీ పరిరక్షణ కమిటీ సభ్యులు

అనంతపురం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆర్డీటీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతి మంజూరు చేయాలని ఆర్డీటీ పరిరక్షణ కమిటీ జిల్లా ఎస్పీ పి. జగదీష్‌కు బుధవారం వినతి పత్రం అందజేసింది. అనంతరం ఆర్డీటీ పరిరక్షణ కమిటీ సభ్యులు సాకే హరి (ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ కన్వీనర్), బాషా (ఐఎంఎం)ఎస్. అంజి, చంద్రబాబు, ఆదాము, డేవిడ్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఆర్డీటీ అందిస్తున్న ఉచిత సేవలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరాటంకంగా కొనసాగడానికి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

కొనసాగుతున్న సచివాలయ ఉద్యోగుల సమ్మె



నగరపాలక సంస్థ ఆవరణంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్రభుత వైఖరి మారకుంటే ఎందాకైనా వెళ్లడానికి సిద్ధమేనని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సమ్మె నోటీసులో భాగంగా సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నగర పాలక సంస్థ ఆవరణంలో ప్లకార్డులతో ఉద్యోగులు నిరసన తెలిపారు. భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సీనియారిటీ జాబితాను విడుదల చేసి పదోన్నతులను కల్పించాలన్నారు. ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.సచివాలయ ఉద్యోగులకు డోర్ టూ డోర్ సేవలన్నీ కూడా పూర్తిగా తొలగించి, ప్రభుత్వ విధులను నిర్దిష్ట జాబ్ చార్ట్ ఆధారంగా నిర్వహించాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లను అందజేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, మల్లికార్జున, వరప్రసాద్, చిన్నరప్ప, చంద్ర, రామకృష్ణ, వీరనారప్ప, నారాయణస్వామి, వినయ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవరచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర్ రావు

అనంతపురం: విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవరచుకోవాలని ఎస్కేయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ప్రొఫెసర్ డి. మురళీధర్ రావు పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం సైన్స్ యూనిట్ –2 ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వేడుకలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవా దృక్పథం కలిగి ఉంటే జీవితాల్లో మంచి మార్పు వస్తుందన్నారు. సేవా పథకం ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీఎం అనూరాధ, మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వాస్పత్రి ఎదుట రోడ్డుపై పశువులను తప్పించుకుని వెళ్తున్న మునిసిపల్ కమిషనర్ అధికారిక వాహనం, పశువులు పోట్లాడుతుండడంతో భయం భయంగా వెళ్తున్న వాహనదారులు

'కదిలే డివైడర్లు'.. నగరవాసులకు కష్టాలు


నగరంలో పశువుల బెడద ఎక్కువైంది. వీధుల్లోనే కాకుండా ప్రధాన రోడ్లపై సైతం ఎక్కడపడితే అక్కడ సంచరిస్తున్నాయి. వాహనాలకు అడ్డొస్తూ.. ఇబ్బందులు కల్గిస్తున్నాయి. ప్రమాదాలకు సైతం కారణమవుతున్నాయి. అధికారుల కళ్లెదుటే పశువులు సంచరిస్తున్నా..వాటిని నగరం బయటకు తరలించడానికి ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



"'పాజిటివ్ థింకింగ్'కు పాజిటివ్-సెల్ఫ్‌టాక్ అనేది మంచి ఫలితాన్ని ఇస్తుంది. ప్రతిరోజు మీకు వచ్చిన ఆలోచనలను గుర్తు తెచ్చుకొని పాజిటివ్, నెగెటివ్ ఆలోచనల లెక్క తేల్చుకోవాలి. ఇలా ఏ రోజుకు ఆ రోజుకు గుర్తు తెచ్చుకోవడం వల్ల మరుసటి రోజు ప్రతికూల ఆలోచనలు రాకుండా జాగ్రత్త పడవచ్చు."

● నవరాత్రి



ఫాల్గుణి పాఠక్

దసరా నవరాత్రులు వస్తే దేశం తలిచే పేరు ఫాల్గుణి పాఠక్. 'దాండియా క్వీన్ ఆఫ్ ఇండియా'గా పేరు గడించిన ఈ 56 సంవత్సరాల గాయని తన పాటలతో, నృత్యాలతో పండగ శోభను తీసుకువస్తుంది. 25 రూపాయల పారితోషికంతో జీవితాన్ని ప్రారంభించి నేడు కోట్ల రూపాయలను డిమాండ్ చేయగల స్థితికి చేరిన ఫాల్గుణి స్ఫూర్తి పై పండుగ కథనం.

ఆమె దాండియాకి ఇండియా నర్తిస్తుంది

దేశంలో దసరా నవరాత్రులు జరుపుకుంటారు. కాని అమెరికాలో, దుబాయ్‌లో, గుజరాతీలు ఉండే అనేక దేశాల్లో వీలును బట్టి ప్రీ దసరా, పోస్ట్ దసరా వేడుకలు కూడా జరుపుకుంటారు.

ఫాల్గుణి పాఠక్ వీలును బట్టి ఇవి ప్లాన్ అవుతాయి. ఆమె దసరా నవరాత్రుల్లో ఇండియాలో ఉంటే దసరా అయ్యాక కొన్ని దేశాల్లో దాండియా డాన్స్‌షోలు నిర్వహిస్తారు. లేదా దసరాకు ముందే కొన్ని దేశాల్లో డాన్స్ షోలు నిర్వహిస్తారు. ఆమె దసరాకు ముందు వచ్చినా, తర్వాత వచ్చినా కూడా ప్రేక్షకులకు ఇష్టమే. ఆమె పాటకు పాదం కలపడం కోసం అలా లక్షలాది మంది ఎదురు చూస్తూ ఉంటారు. అంతటి డిమాండ్ ఉన్న గాయని ఫాల్గుణి పాఠక్ మాత్రమే.

తండ్రిని ఎదిరించి...

ఫాల్గుణి పాఠక్‌ది తన రెక్కలు తాను సాచ గల ధైర్యం. నలుగురు కూతుళ్ల తర్వాత ఐదవ కూతురుగా ముంబై లోని ఒక గుజరాతి కుటుంబంలో జన్మించింది ఫాల్గుణి. నలుగురు కూతుళ్ల తర్వాత ఐదవ సంతానమైనా అబ్బాయి పుడతాడని భావిస్తే ఫాల్గుణి పుట్టింది. అందుకే తల్లి, నలుగురు అక్కలు ఆమెకు ప్యాంటు, షర్టు తొడిగి అబ్బాయిలా భావించి ముచ్చట పడేవారు. రాను రాను ఆ బట్టలే ఆమెకు కంఫర్ట్‌గా మారాయి. వయసు వచ్చే సమయంలో తల్లి హితవు చెప్పి, అమ్మాయిలా ఉండమని చెప్పినా ఫాల్గుణి మారలేదు. ఆ ఆహార్యం ఒక తిరుగుబాటైతే పాట కోసం తండ్రిని ఎదిరించడం మరో తిరుగుబాటు. తల్లి దగ్గరా, రేడియో వింటూ పాట నేర్చుకున్న ఫాల్గుణి పాఠక్ స్కూల్లో పాడుతూ ఎనిమిదో తరగతిలో ఉండగా మ్యూజిక్ టీచర్‌తో కలిసి ముంబైలోని వాయుసేన వేడుకలో పాడింది. ఆమె పాడిన పాట 'ఖుర్బానీ' సినిమాలోని 'లైలా ఓ లైలా'. అది అందరినీ అలరించిందిగానీ ఇంటికి వచ్చాక తండ్రి చావబాదాడు.. పాటలేంటి అని. కాని అప్పటికే పాటలో ఉండే మజా ఆమె తలకు ఎక్కింది. ఆ తర్వాత తరచూ ప్రదర్శనలు ఇవ్వడం ఇంటికి వచ్చి తండ్రి చేత దెబ్బలు తినడం... చివరకు విసిగి తండ్రి వదిలేశాడుగాని ఫాల్గుణి మాత్రం పాట మానలేదు.

త-థయ్యా బ్యాండ్

తన ప్రదర్శనలతో పాపులర్ అయ్యాక సొంత బ్యాండ్ స్థాపించింది ఫాల్గుణి. దాని పేరు 'త-థయ్యా'. ఆ బ్యాండ్‌తో దేశంలోని అన్నిచోట్లా నవరాత్రి షోస్ మొదలెట్టింది. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా, గర్బా డాన్స్ చేసే ఆనవాయితీ ఉత్తరాదిలో ఉంది. ఫాల్గుణికి ముందు ప్రదర్శనలిచ్చేవారు కేవలం ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌ను మాత్రమే వినిపిస్తూ డాన్స్ చేసేవారు. ఫాల్గుణి తనే దాండియా, గర్బా నృత్యాలకు వీలైన పాటలు పాడుతూ ప్రదర్శనకు హుషారు తేసాగింది. దాండియా సమయంలో ఎలాంటి పాటలు పాడాలో, జనంలో ఎలా జోష్ నింపాలో ఆమెకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియదు. అందుకే ఆమె షోస్ అంటే జనం విరగబడేవారు. 2010లో మొదటిసారి నవరాత్రి సమయాల్లో ఆమె గుజరాత్ టూర్ చేసినప్పుడు ప్రతిరోజూ 60 వేల మంది గుజరాత్ నలుమూలల నుంచి ఆమె షోస్‌కు హాజరయ్యేవారు.

తండ్రితోనే

ఏ తండ్రైతే ఆమెను పాడవద్దన్నాడో ఆ తండ్రికి తనే ఆధారమైంది ఫాల్గుణి. ఆమెకు 15 ఏళ్ల వయసులోనే తల్లి హార్ట్ ఎటాక్‌తో మరణించడంతో కుటుంబ భారం తనే మోసి ఇద్దరు అక్కల పెళ్లిళ్లు తనే చేసింది. తండ్రిని చూసుకుంది. వివాహం చేసుకోవడానికి ఇష్టపడని ఫాల్గుణి 'నేను నాలాగే హాయిగా ఉన్నాను' అంటుంది. గత 25 ఏళ్లుగా 30 మంది సభ్యుల బృందం స్థిరంగా ఆమె వెంట ఉంది. ప్రతి ప్రదర్శనలో వీరు ఉంటారు. వీరే నా కుటుంబం అంటుందామె.

ప్రయివేట్ ఆల్బమ్స్

స్టేజ్ షోలతో పాపులర్ అయిన ఫాల్గుణి తొలిసారి 1998లో తెచ్చి 'యాద్ పియాకీ ఆనె లగీ'... పేరుతో విడుదల చేసిన ప్రయివేట్ ఆల్బమ్ సంచలనం సృష్టించింది. ఊరు, వాడ 'యాద్ పియాకీ ఆనె లగీ' పాట మార్మోగిపోయింది. యువతరం హాట్ ఫేవరెట్‌గా మారింది. 1999లో విడుదల చేసిన 'మైనె పాయల్ హై ఛన్‌కాయ్'... కూడా పెద్ద హిట్. ఈ ఆల్బమ్స్‌లో పాటలు కూడా ఆమె తన నవరాత్రుల షోస్‌లో పాడటం వల్ల ఆమెకు విపరీతమైన క్రేజ్ వచ్చింది.

రోజుకు 70 లక్షలు

2013 సమయానికి ఫాల్గుణి పాఠక్ నవరాత్రి డిమాండ్ ఎంత పెరిగిందంటే రోజుకు 70 లక్షలు ఆఫర్ చేసే వరకూ వెళ్లింది. నవరాత్రుల మొత్తానికి 2కోట్ల ఆఫర్ కూడా ఇవ్వసాగారు. ఆశ్చర్యం ఏమిటంటే నవరాత్రుల్లో అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి దాండియా, గర్బా నృత్యాలు చేస్తారు. కాని ఫాల్గుణి ఆ దుస్తులు ఏవీ ధరించదు. ప్యాంట్ షర్ట్ మీదే ప్రదర్శనలు ఇస్తుంది. 'ఒకసారి ఘాగ్రా చోళీ వేసుకొని షో చేశాను. జనం కింద నుంచి ఇలా వద్దు నీలాగే బాగుంటావు అని కేకలు వేశారు. ఇక మానేశాను' అంటుందామె.

వెలుగులు చిమ్మాలి

ఫాల్గుణి ప్రదర్శన అంటే స్టేజ్ మాత్రమే కాదు గ్రౌండ్ అంతా వెలుగులు చిమ్మాలి. గ్రౌండ్‌లోని ఆఖరు వ్యక్తి కూడా వెలుతురులో పరవశించి ఆడాలని భావిస్తుంది ఫాల్గుణి. ప్రతి నవరాత్రి ప్రదర్శన సమయంలో నిష్ఠను పాటించి పాడుతుందామె. 'నేను ఇందుకోసమే పుట్టాను. నాకు ఇది మాత్రమే వచ్చు' అంటుంది. ఆమెకు విమాన ప్రయాణం అంటే చాలా భయం. 'విమానం ఎక్కినప్పటి నుంచి హనుమాన్ చాలీసా చదువుతూ కూచుంటాను. అస్సలు నిద్ర పోను' అంటుందామె. హనుమాన్ చాలీసా ఇచ్చే ధైర్యంతో ప్రపంచంలోని అన్ని మూలలకు ఆమె ఎగురుతూ భారతీయ గాన, నృత్యాలకు ప్రచారం కల్పిస్తోంది.

అమ్మ స్ఫూర్తి..

నవశక్తి

'మనలో శక్తి ఎంత ఉందో నడిచి వచ్చిన మన మార్గమే చూపుతుంది' అంటారు డాక్టర్ సాయిలత. కర్ణాటకలోని హోస్పేట్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న సాయిలత కర్నూలు వాసి. ఒంటరిగా తల్లి పడుతున్న కష్టాన్ని అర్థం చేసుకుంటూ, ఆర్థిక స్థోమత లేకపోయినా పెద్ద కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో పట్టుదలతో కృషి చేసి డాక్టర్‌గా ఎదిగారు. సేవామార్గాన్నీ వదలకుండా అమ్మాయిల ఆరోగ్య జీవన విధానానికి, విద్యార్థులకు చెప్పాల్సిన విషయాల్లో బోధకురాలిగా తన జీవన ప్రయాణాన్ని మెరుగ్గా మలుచుకున్నారు. ఆ వివరాలు సాయిలత మాటల్లోనే...

''ఈ రోజు గైనకాలజిస్ట్‌గా సేవలందించే స్థాయికి రావడం అంత సులువుగా కాలేదు. నేను పుట్టి పెరిగింది కర్నూలులో. సింగిల్ మదర్‌గా మా అమ్మ నన్నూ చెల్లెలిని పోషించడానికి చాలా కష్టపడేది. రిసెప్షనిస్ట్‌గా, గోడౌన్ ఇన్‌చార్జిగా.... చిన్న చిన్న ప్రైవేట్ జాబులు చేస్తూ ఉండేది. అమ్మ కష్టం చూస్తుంటే చాలా బాధ అనిపించేది. కానీ, నాకేమో డాక్టర్ అవాలని కల. అమ్మ నా ఆలోచనను నిరుత్సాహపరచలేదు.

'అభయం'తో...

టెన్త్‌లో మంచి మార్కులు వచ్చాయి. మేం పెద్దవుతుంటే ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. కాలేజీ ఫీజులు కట్టే స్థోమత లేదు. ఇప్పుడెలా... అనుకుంటున్నప్పుడు హైదరాబాద్‌లో ఉన్న 'అభయ' స్వచ్ఛంద సంస్థ గురించి తెలిసింది. వాళ్లను కలిస్తే, ఫీజులకు సాయం చేశారు. ఆ తర్వాత ఎమ్‌సెట్ రాస్తే వచ్చిన ర్యాంకుకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల సీటు రాలేదు. దాంతో లాంగ్ టర్మ్ కోచింగ్‌కి సాయం కోసం వెతుకుతుండగా ఈ విషయం తెలిసి, అభయ ఫౌండేషన్ వాళ్లే పిలిపించి మరీ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు సాయం చేశారు. ఆ యేడాది మంచి ర్యాంకు తెచ్చుకున్నాను. అనంతపూర్ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు వచ్చింది. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత పీజీ కోర్సుకు ఏడాది కోచింగ్ తీసుకున్నాను. ఆలిండియా నీట్‌లో ర్యాంకు వచ్చింది.



ప్రసూతి వైద్య నిపుణురాలిగా డా సాయిలత

మహారాష్ట్ర అకోలా మెడికల్ కాలేజీలో పీజీ పూర్తి చేశాను. స్కాలర్‌షిప్స్ వచ్చాయి. సంస్థ నుంచి సాయం అందింది. నా క్లాస్‌మేట్, పీడియాట్రిషియన్ డాక్టర్ తిరుమలేశ్‌తో నా పెళ్లి జరిగింది. మా అత్తగారిది కర్ణాటకలోని హోస్పేట్. దాంతో మేమిద్దరం కలిసి, అక్కడే క్లినిక్ నడుపుతున్నాం. పండక్కి హైదరాబాద్‌లో ఉంటున్న అమ్మ లక్ష్మి, చెల్లెలు ధరణిల వద్దకు వచ్చాను. మాకోసం ఎంతో కష్టపడిన అమ్మకు విశ్రాంతి కల్పించాను.

సేవా మార్గం...

ఉంటున్న చోటనే డాక్టర్‌గా వృత్తిని కొనసాగిస్తూ, గర్ల్ సేఫ్టీ గురించి అవగాహనా తరగతులు తీసుకుంటున్నాను. నెలసరి సమయంలో ఎలా ఉండాలి, రక్తహీనత, థైరాయిడ్, అధికబరువు, గర్భధారణ.. ఇలా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు మహిళల్లో ఉండే ఆరోగ్య సమస్యలు, వాటిపైన సెషన్స్ చెబుతూనే ఆన్‌లైన్ ద్వారా స్టూడెంట్స్‌కు ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం మొదలైన విషయాలపైనా గైడెన్స్ ఇస్తుంటాను. ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి, అమ్మాయిలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరిస్తుంటాను. ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంచుకోవాలి, అమ్మాయిల రక్షణకు సంబంధించిన విషయాలు నృత్య, నాటకాల ద్వారా చెబుతుంటాను 'అభయ' వల్ల నా జీవితానికి మార్గం ఏర్పడింది. అందుకు నా వంతుగా తిరిగి ఆ సంస్థకు ఉన్న 30 సెంటర్లలోని టీచర్లకు గైడెన్స్ ఇస్తుంటాను. హెల్త్ క్యాంపుల్లో ఉచిత సేవలు అందిస్తుంటాను.

నాలుగు గోడల మధ్య ఏమీ తెలియని ప్రపంచం నుంచి బయల్దేరిన నాకు ఈ రోజు కొన్ని వందలమందికి అవగాహన కలిగించే స్థాయి లభించింది. ఈ ప్రయాణంలో అమ్మ కష్టం, అభయ అందించిన సాయం నన్ను నిలబెట్టాయి. అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకోవడంతో పాటు, వాటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలన్నది నా జీవన ప్రయాణం నేర్పిన పాఠం. శక్తి మనలో ఉందని గుర్తిస్తే ఎదగడానికి మద్దతు కూడా లభిస్తుంది. ప్రయాణంలో మనకు శక్తిగా నిలిచినవారికి తిరిగి మన శక్తిని అందించినప్పుడు ఆ ఆనందం గొప్పగా ఉంటుంది'' అని వివరించారు ఈ డాక్టర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళకు సృజనకు కొలువు

దేవీ శరన్నవరాత్రులంటే దేవీ పూజ, అలంకారాలు, నైవేద్యాలు మాత్రమే కాదు. కన్నుల పండుగైన బొమ్మల కొలువులు కూడా. దసరాపండుగ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం దక్షిణ భారత రాష్ట్రాల్లో ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, తమిళనాడులలో సంప్రదాయం..

దుర్గాదేవి రాక్షసులతో తలపడి వారిపై సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండగ జరుపుకుంటున్నాం. అందులో భాగంగా పెట్టుకునే ఈ బొమ్మల కొలువులు సాధారణంగా ఇళ్లలోనే ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల ఆలయాల్లో కూడా అలంకరిస్తారు. ఈ బొమ్మల కొలువు ఏర్పాట్లు, ఆ అలంకరణ హడావిడంతా ప్రధానంగా అమ్మాయిలు, అమ్మలదే అయితే, తండ్రులు, అన్నదమ్ములు వారికి కావలసిన బొమ్మలను సమకూర్చే బాధ్యతను తీసుకుంటారు.

ఎవరి ప్రాంతాలలో, ఇళ్లల్లో ఆచారాన్ని, అలవాటును బట్టి వారు సంక్రాంతికి అయితే సంక్రాంతికి, దసరాకు అయితే దసరాకూ బొమ్మల కొలువు పెడుతుంటారు. సాధారణంగా దసరా బొమ్మల కొలువుకు అమ్మవార్లను, సంక్రాంతి బొమ్మల కొలువులో శివకేశవులకు సంబంధించిన బొమ్మలనూ ఎక్కువగా అలంకరిస్తారు. అది కేవలం ఒక వేడుక మాత్రమే.

పిల్లల ఉల్లాసం.. ఉత్సాహం

పిల్లల ఆనందం, ఉత్సాహాల కోసం తీర్చిదిద్దే ఈ అమరికలోనే వారి కళానైపుణ్యం, సృజన బయట పడతాయి. బొమ్మల కొలువులో తొమ్మిది మెట్లుంటాయి.

మెట్లపై తెల్లని వస్త్రం పరచి ఆ పై బొమ్మలను అమర్చుతారు. ఎవరెవరి కళాత్మక దృష్టి, ఆర్థిక స్తోమత, అవసరాలు, కోరికలు, మొక్కుబడులు, సౌకర్యాలకు అనుగుణంగా వాళ్ళు ఈ మెట్లపై రకరకాల బొమ్మలను అమరుస్తారు. పై మెట్లపై దేవుళ్ళ బొమ్మలను ఉంచుతారు. కింద వున్న మెట్లు పై ప్రాపంచిక జీవితానికి సంబంధించిన బొమ్మలు వుంచుతారు. అవి తామస గుణాన్ని ప్రతిబింబిస్తాయని అంటారు. మధ్య భాగంలో క్షత్రియధర్మాన్ని తెలుపుతూ ఉండే రాజు, రాణి, యుద్ధవీరుల వంటి బొమ్మలను ఉంచుతారు. ఇక అన్నిటికన్నా పై మెట్టు మీద వుంచే కలశాన్ని సంపదకు, అమ్మవారి ఆశీరనుగ్రహాలకూ సూచనగా భావిస్తారు. ఇదీ బొమ్మలకొలువు తత్వం.

విశేషాలు

దీప ధూప నైవేద్యాలతో ప్రతిరోజూ లలితా సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరం చదివి పూజలు చేస్తారు. రోజూ ఒక కన్యకి (చిన్నఅమ్మాయి), ఒక సువాసినికి నవకాయ పిండివంటలతో భోజనం పెట్టి తాంబూలం, అలంకరణ వస్తువులు, బట్టలు ఇస్తారు. కొందరు ఇలా దసరా తొమ్మిదిరోజులు, కొందరు మూడు రోజులూ చేస్తారు. బంధుమిత్రులను, పిల్లలను సాయంత్రం పేరంటానికి పిలిచి, అందరికీ పసుపు – కుంకుమ, తాంబూలం, దక్షిణ ఇస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని విశ్వాసం. బొమ్మల కొలువుకు పాత బొమ్మలే వాడినా, ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఓ కొత్తబొమ్మ కొనడం సంప్రదాయం.



మీరు బొమ్మల కొలువు పెట్టారా?

దసరాకు మీరు బొమ్మల కొలువు పెట్టారా? అయితే ఆ బొమ్మల కొలువుతో ఒక సెల్ఫీ తీసుకుని ఊరు, పేరు రాసి ఈ కింది చిరునామాకు మెయిల్ చేయండి. బాగున్న వాటిని ఫ్యామిలీలో ప్రచురిస్తాం.

sakshibommalakoluvu@gmail.com

పెద్దలే దగ్గరుండి...

ముందే చెప్పుకున్నట్లుగా బొమ్మల కొలువు అన్నది వారి వారి ఆర్థిక స్తోమత, సృజనాత్మకత, కళాత్మకతల ఆధారంగా ఏర్పాటు చేస్తుంటారు. వీటిని సాధారణంగా పెద్దవాళ్లు దగ్గరుండి పిల్లల చేత చేయిస్తుంటారు. కొందరు బొమ్మల కొలువు కోసం బంకమట్టితో అమ్మవార్ల ప్రతిమలను తయారు చేసి, వాటికి రంగులద్ది రకరకాల పూసలతో రూపొందించిన ఆభరణాలను అలంకరిస్తుంటారు.

సెలవులలో పిల్లలను పెద్దవాళ్లు ఇటువంటి వాటి దిశగా ప్రోత్సహిస్తే వారిలో భక్తి శ్రద్ధలతో బాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. ఫలితంగా చదువుపైన కూడా ఆసక్తి కలుగుతుందనడంలో సందేహం లేదు.

– డి.వి.ఆర్.

● సోషల్ మీడియా

లక లక లక... గ్రామ సింహాల కళ!





'చంద్రముఖి' సినిమాలో 'లక లకలక' అంటూ శునకాలతో రజినీకాంత్ వచ్చే దృశ్యంలో రాజసం ఉట్టిపడుతుంది. రాజసం ఉట్టిపడే మాట ఎలా ఉన్నా, ఈ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అయింది. బెంగళూరులోని ఆర్‌టీ నగర్‌లో ఒక మహిళ 28 గోల్డెన్ రిట్రీవర్స్(శునకాలు)తో వీధుల వెంట తిరిగింది.

ఈ వీడియో క్లిప్‌ను...

'28 డాగ్స్, 1 బిగ్ హార్ట్, మీట్ ది డాగ్ లవర్ ఆంటీ' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

'మనుషులను నమ్ముకోవడం కంటే ఇలా శునకాలను నమ్ముకొని బయటకు రావడం మేలు'

'దయాగుణం, విశ్వాసం...రెండూ కలిసి నడుస్తున్నట్లుగా ఉంది'

'శునకాలతో కాదు సింహాలతో తిరుగుతున్నట్లుగానే ఉంది'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

● మన(సు)లో మాట

ఈ ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాను!

నా వయసు 32 సంవత్సరాలు. నేను ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 వరకు పని ఉంటుంది. ఇంటికి వచ్చాక వంట, పిల్లాడి హోంవర్కు, ఇల్లు చూసుకోవడం అన్నీ నామీదే పడతాయి. నా భర్త కూడా ఇంకో ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగి. ఇంటి పనుల్లో అసలు సహాయం చేయడు. దీనివల్ల నాకు ఎప్పుడూ అలసటగా, చిరాకుగా అనిపిస్తుంటుంది. దీనికితోడు నాభర్త, అత్తమామలు ఇప్పుడు ఇంకో బిడ్డ కావాలని వత్తిడి చేస్తున్నారు. బ్యాంక్ పనిలో వత్తిడి, అత్త మామల విమర్శలు, భర్త సపోర్ట్ లేకపోవడం... ఇలా వీటన్నిటి మధ్య చాలా అశాంతికి లోనవుతున్నాను. మీరే ఏదైనా మంచి సలహా ఇస్తారని ఆశిస్తున్నాను.

– దీపిక, నిజామాబాద్

మీది మన సమాజంలో చాలామంది మహిళలు ఎదుర్కొనే పరిస్థితే! పని, ఇల్లు రెండూ ఒంటరిగా మేనేజ్ చేయడం వల్ల అలసట, చిరాకు రావడం సహజం. అందుకే ముందుగా మీ భర్తతో ఓపిగ్గా మాట్లాడి అతను కూడా ఇంటి పనులు పంచుకోవడం అవసరమని చెప్పండి. చిన్న చిన్న పనులలో అయినా సరే అతను చేసే సహాయం మీ అలసటను తగ్గించడమే కాకుండా మీ మధ్య బంధాన్ని మరింత దృఢం చేస్తుందని అతనికి అర్థం అయ్యేలా వివరించండి. మీ అత్తమామలు, భర్త, ఇంకో పిల్లాడు కావాలని వత్తిడి తెస్తున్నారని చెప్పారు. పిల్లల విషయం అనేది మీరు, మీ భర్త కలిసి తీసుకోవాల్సిన నిర్ణయమే తప్ప మీ అత్త మామలు నిర్ణయించే విషయం కాదని మీ ఆయనకి నచ్చ చెప్పండి. మీరు మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా సిద్ధం కాకపోతే కేవలం వాళ్ళ వత్తిడి మీద నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. కొంత కాలం మీ అత్త మామలని మీ ఇంట్లోనే ఉండమని మీ బాబును చూసుకోవడంలో, ఇంట్లో పనుల్లో సహాయం చేయమని అడగండి. వాళ్ళు అందుకు ఒప్పుకుంటే అప్పుడు రెండో పిల్లాడి గురించి ఆలోచించవచ్చు. ఉద్యోగం, కుటుంబం రెండూ కలిపి నడపడం కష్టం అయినా, అసాధ్యం అయితే కాదు! ఇంట్లో పనుల కోసం పని వాళ్ళని ఏర్పాటు చేసుకోండి. ఆఫీస్ లో కూడా అన్ని పనులు మీ నెత్తిమీద వేసుకోకుండా మిగిలిన మీ వారికి కూడా డెలిగేట్ చేయడం నేర్చుకోండి. అలాగే మీకోసం రోజుకు కొంచెం సమయం కేటాయించండి.. కాసేపు నడక, ధ్యానం, సంగీతం, లేదా మీకు ఇష్టమైన పనులు చేస్తూ రిలాక్స్ అవ్వండి. వర్క్, పర్సనల్, ఫ్యామిలీ లైఫ్‌ను, జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తే, మీ వత్తిడి క్రమేణా తగ్గుతుంది. కావాలంటే మీ దంపతులు ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఒకసారి కౌన్సెలింగ్‌కి వెళ్తే కౌన్సిలర్స్ మీకు సరైన నిర్ణయం తీసుకునేందుకు సహాయం చేస్తారు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● బ్యూటిప్



కాళ్ల పగుళ్ల నివారణకు...

అర కప్పు కొబ్బరి నూనెలో కొద్దిగా వేపాకు, పావు టీ స్పూన్ పసుపు, కొద్దిగా కర్పూరం వేసి కాచాలి. చల్లారిన తరవాత వడకట్టి, ఆ నూనెను రాత్రి పడుకునే ముందు కాళ్ల పగుళ్ల మీద అప్లై చేయాలి. రెండు నిమిషాలు మర్దనా చేస్తే ఉపశమనం ఉంటుంది.

నునుపయిన చేతులకోసం...

ఉడకబెట్టిన బంగాళదుంప గుజ్జుతో చేతుల మీద అయిదు నిమిషాలు రుద్ది చన్నీటితో కడిగేయాలి. వారంలో ఒకసారి ఈవిధంగా చేస్తే చేతులు నునుపవుతాయి.

సమ్‌థింగ్ స్పెషల్

75 రోజుల దసరా!



డెబ్బై అయిదు రోజుల పాటు జరిగే దసరా పండగ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ బస్తర్‌లో కొనసాగుతోంది. 'జోగి బిథాయి' సంప్రదాయంలో భాగంగా హల్బా తెగకు చెందిన ఒక యువకుడు సాధువు వేషధారణతో దంతేశ్వరీ ఆలయంలో భూమికి ఆరు అడుగుల దిగువన, జ్యోతి ఎదురుగా తొమ్మిది రోజుల పాటు పీఠంపై కూర్చుంటాడు. ఈ యువకుడు ఎనిమిది రోజులు ఉపవాసం ఉంటాడు.

'జోగి బిథాయి' సంప్రదాయానికి 600 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇందులో పాత్ జత్ర, దేరి గడాయి, కాంచన గడాయి సంప్రదాయాలు ఉంటాయి. మవల్లి ఆలయంలో పూజారి దీపం వెలిగించడంతో దసరా ఉత్సవాలు మొదలవుతాయి. ఒక ఖడ్గాన్ని ఆలయంలో పెట్టి పూజలు చేస్తారు. ఈ పురాతన సంప్రదాయాన్ని ఇటలీకి చెందిన ఇద్దరు యువకులు డాక్యుమెంట్ చేశారు.

'ఇక్కడి ప్రజలు నిరాడంబరంగా, స్నేహంగా ఉంటారు. ఇక్కడ దసరా పండగ రకరకాల సంప్రదాయలతో కన్నుల పండుగగా జరుగుతుంది' అంటున్నాడు 'జోగి బిథాయి' సంప్రాదాయాన్ని వీడియో డాక్యుమెంట్ చేసిన యువకులలో ఒకరైన డేనియల్.

ప్రపంచంలో జరిగే అతి పెద్ద దసరా వేడుకలలో 'జోగి బిథాయి'కి ప్రత్యేక గుర్తింపు ఉంది.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) సెప్టెంబర్ 24న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	1,19,210
బంగారం (22 క్యారెట్లు)	1,12,760
వెండి	1,43,000

విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,17,340
బంగారం (22 క్యారెట్లు)	1,05750
వెండి	1,39,000

విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,15,370
బంగారం (22 క్యారెట్లు)	1,05,750
వెండి	1,50,000

రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,17,340
బంగారం (22 క్యారెట్లు)	1,08,920
వెండి	1,39,000

ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	1,18,700
బంగారం (22 క్యారెట్లు)	1,09,200
వెండి	1,39,900

చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,15,630
బంగారం (22 క్యారెట్లు)	1,06,000
వెండి	1,50,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.